వర్సిటీ ఘటనపై డీజీపీకి మహిళా కమిషన్ లేఖ

- పోలీసుల చర్యను సుమోటోగా స్వీకరించిన కమిషన్

హైదరాబాద్, జనవరి 25 (నమస్తే తెలంగాణ): వ్యవసాయ వర్సిటీలో విద్యార్థినిపై పోలీసుల దాడిని రాష్ట్ర మహిళా కమిషన్ తీవ్రంగా పరిగణిస్తూ సుమోటోగా స్వీకరించింది. ఈ మేరకు గురువారం డీజీపీకి లేఖ రాసింది. బాధ్యులైన మహిళా పోలీసులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. విద్యార్థినిని జుట్టు పట్టుకుని మహిళా కానిస్టేబుళ్లు ఈడ్చుకెళ్లడం అమానుషమని ఆగ్రహం వ్యక్తం చేసింది. ఘటనపై వెంటనే సమగ్ర విచారణ జరిపి నివేదిక సమర్పించాలని ఆదేశించింది. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని పోలీ సుశాఖను ఆదేశించింది.

వారంలో బీజేపీ ఎంపీ అభ్యర్థుల ప్రకటన

- కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

హైదరాబాద్, జనవరి 25 (నమస్తే తెలంగాణ): బీజేపీ లోక్‌సభ అభ్యర్థుల ఎంపిక తుది దశకు చేరిందని, వారం రోజుల్లో ప్రకటిస్తామని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వెల్లడించారు. హైదరాబాద్‌లో గురువారం జరిగిన బీజేపీ పార్లమెంట్ నియోజకవర్గాల సన్నాహాక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికలకు సిద్ధం కావాలని కిషన్‌రెడ్డి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఏ పార్టీతోనూ తాము కలవాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. వేరే పార్టీతో కుమ్మక్కయ్యారంటూ ప్రచారం చేసేవాళ్లను చెప్పుతో కొట్టే రోజులు వస్తాయని హెచ్చరించారు. బీజేపీ అగ్గిలాంటి పార్టీ అని, తమను విమర్శించేటప్పుడు ఒళ్లు దగ్గరపెట్టుకోవాలని ఇతర పార్టీలకు సూచించారు. హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో అసదుద్దీన్ ఒవైసీని ఓడించడం కోసం పనిచేయాలని కార్యకర్తలకు సూచించారు. హైదరాబాద్ ముస్లింలు మజ్లిస్‌ను ఓడించాలని చూస్తున్నారని, ముస్లిం మహిళలు ఈ దఫా బీజేపీకి ఓటేయడానికి ముందుకొస్తున్నారని తెలిపారు. ఈ నెల 28న అమిత్ షా తెలంగాణలో పర్యటిస్తారని, 'ప్రొఫెషనల్ మహిళలతో' జరిగే సభలో పాల్గొంటారని చెప్పారు.

ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే దాడులా?

- విద్యార్థులపై దాడులు సరికాదు
- ఆ కానిస్టేబుళ్లపై చర్యలు తీసుకోవాల్సిందే
- బీజేపీ జిల్లా అధ్యక్షుడు నర్సింహా రెడ్డి
- ఏబీవీపీ నాయకురాలు మనీషా
- 'అగ్రికల్చర్ యూనివర్సిటీ విద్యార్థుల ధర్నాకు మద్దతు

ధర్నాలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి

వీ విల్ వాంట్ జస్టిస్

వ్యవసాయ యూనివర్సిటీ, జనవరి 25: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెల రోజులైనా గడవకముందే నవ్వులపాలైందని బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి విమర్శించారు. రాజేంద్రనగర్‌లోని అగ్రికల్చర్ యూనివర్సిటీ భూములను హైకోర్టుకు కేటాయించడాన్ని నిరసిస్తూ విద్యార్థులు వరుసగా 17వ రోజు చేస్తున్న ధర్నాకు గురువారం ఆయన మద్దతు తెలిపి వీసీ భవన్ ఎదుట బైఠాయించారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ.. విద్యార్థుల శాంతియుత ఉద్యమంపై పోలీసుల దాడులు సరికాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి ఝాన్సీపై బుధవారం దాడి చేసిన మహిళా కానిస్టేబుళ్లను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఏబీవీపీ రాష్ట్ర నాయకురాలు మనీషా మాట్లాడుతూ అలసత్వం వహిస్తే ఇక్కడి భూములు అన్యాక్రాంతం కావడంతోపాటు కాలుష్యంతో హైదరాబాద్ నగరం ఢిల్లీని తలపిస్తుందని పేర్కొన్నారు. ఇక్కడి యూనివర్సిటీకి ప్రపంచవ్యాప్త గుర్తింపు ఉన్న విషయాన్ని గుర్తు చేశారు. వర్సిటీ విద్యార్థి నాయకురాలు శ్రీజ మాట్లాడుతూ దేశానికి అన్నంపెట్టే యూనివర్సిటీ భూములతో రియల్ వ్యాపారం సిగ్గుచేటని మండిపడ్డారు. ఘనచరిత్ర కలిగిన వర్సిటీ భూములను కోల్పోతే వ్యవసాయ రంగం దెబ్బతింటుందని, శాస్త్రవేత్తలు, వ్యవసాయ విద్యార్థులకు తీరని నష్టం జరుగుతుందని విద్యార్థి నాయకులు రాజ్‌కుమార్, శంకర్‌నాయక్ ఆవేదన వ్యక్తం చేశారు. రాజేంద్రనగర్ వర్సిటీ విద్యార్థులతో పాటు పాలెం, సిరిసిల్ల, వరంగల్, ఆదిలాబాద్, అశ్వారావుపేట, సంగారెడ్డిలోని వ్యవసాయ కళాశాలల విద్యార్థులు కూడా నిరసనల్లో పాల్గొన్నారు. రాజేంద్రనగర్ వర్సిటీలో జరిగిన ధర్నాలో విద్యార్థి సంఘాల నాయకులు రాజ్‌కుమార్, శ్రీజ, అరవింద్, మధుకర్, సత్యమూర్తి, శంకర్‌నాయక్, సురేందర్, దీక్షిత్, భానుచందర్, హరిప్రియ, శిరీష, అరవింద్, వంశీచందర్‌రెడ్డి, వినయ్‌రెడ్డి, రాకేశ్‌తోపాటు డీవైఎఫ్ఐ రాష్ట్ర నాయకులు కోట రమేశ్, ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కళ్యాణి, మహేశ్, దీప్తి, శ్రీకాంత్, ప్రదీప్, సూర్యప్రకాశ్ పాల్గొన్నారు. అంతకుముందు కొత్తగూడెం ఎమ్మెల్యే సాంబశివరావుని కలిసి సమస్య వివరించి మద్దతు కోరారు.

మంత్రి పొన్నం ప్రభాకర్‌కు మెమొంటోను అందజేసి ఆశీర్వదిస్తున్న సిద్ధేశ్వరానంద భారతి మహాస్వామి

లోక కల్యాణానికి యాగాలు అభినందనీయం

- రవాణా శాఖ మంత్రి పొన్నం

కవాడిగూడ, జనవరి 25: లోక కల్యాణంతోపాటు దేశ ప్రజలందరూ సంతోషంగా ఉండాలని పీఠాధిపతులు యాగాలు చేయడం అభినందనీయమని, కుర్తాళం శ్రీ సిద్ధేశ్వర పీఠం ఆధ్వర్యంలో ఇలాంటి యాగాలు నిర్వహించడం హర్షణీయమని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ కొనియాడారు. హైదరాబాద్ ఎన్టీఆర్ స్టేడియంలో కుర్తాళం శ్రీ సిద్ధేశ్వరానంద భారతి మహాస్వామి 88వ అవతరణ ఉత్సవాలు గురువారం నాటికి ఐదోరోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా నిర్వహిస్తున్న కోటి ప్రత్యంగిర మహాయాగంలో భాగంగా శ్రీ సరస్వతి బ్రహ్మదేవ కల్యాణ మహోత్సవం కన్నులపండువగా నిర్వహించారు. ఈ ఇదేరోజు సామూహిక శ్రీలతా పారాయణ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో జరిగింది. రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్, ఎంపీ, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య హాజరై ప్రత్యేక పూజలు చేశారు. వారికి సిద్ధేశ్వరానంద భారతి మహాస్వామి మెమొంటోలను అందజేసి ఆశీర్వదించారు. అనంతరం భక్తులకు అనుగ్రహ భాషణం చేశారు. భక్తులకు తీర్థప్రసాద వితరణ, అన్నదానం ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో రమ్యానంద భారతి, మనిపల్లె శ్రీనివాస్, మోచర్ల శశిభూషణ్ పాల్గొన్నారు.

వర్సిటీ భూములతో 'రియల్' వ్యాపారమా?

- బీఆర్ఎస్ నేత దాసోజు ఆగ్రహం

హైదరాబాద్, జనవరి 25 (నమస్తే తెలంగాణ): హైకోర్టు నిర్మాణానికి వ్యవసాయ యూనివర్సిటీ భూములను ఇవ్వొద్దంటూ నిరసన తెలుపుతున్న విద్యార్థులపై పోలీసుల దాడిని బీఆర్ఎస్ పార్టీ నేత దాసోజు శ్రవణ్ ఖండించారు. జీవవైవిధ్యానికి విఘాతం కలిగించడంతోపాటు భవిష్యత్తు తరాలకు ఉపయోగపడాల్సిన భూములను రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం కొత్త హైకోర్టు భవనం పేరుతో గుంజుకోవడం దారుణమని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. జీవో 55ను వెనక్కి తీసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డిని డిమాండ్ చేస్తూ 'ఎక్స్'లో ఆయన పోస్టు చేశారు. దాసోజు 'ఎక్స్' పోస్ట్‌ను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రీ పోస్ట్ చేశారు. మరోవైపు, ఏబీవీపీ కార్యకర్త ఝాన్సీపై దాడిని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అమానవీయ చర్యగా పేర్కొన్నారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ ఘటనపై సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే స్పందించాలని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ కోరారు. హైకోర్టుకు 100 ఎకరాలు కేటాయించడాన్ని సమీక్షించి, అవసరం ఉన్నంత మేరకే ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ మాట్లాడుతూ పోలీసులు వ్యవహరించిన తీరును చూసి సభ్యసమాజం అసహ్యించుకుంటున్నదని మండిపడ్డారు. ఇంతకంటే హేయం మరొకటి ఉండదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే సమగ్ర న్యాయ విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

వికలాంగుల విభాగం అధ్యక్షుడిగా నాగేశ్వరరావు

హైదరాబాద్, జనవరి25 (నమస్తే తెలంగాణ): బీజేపీ వికలాంగుల విభాగం అధ్యక్షుడిగా అఖిల భారత వికలాంగుల వేదిక జాతీయ అధ్యక్షుడు కొల్లి నాగేశ్వరరావు నియమితులయ్యారు. గురువారం ఆయనకు కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి నియామకపత్రం అందజేశారు. తనకు పదవి ఇచ్చిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి నాగేశ్వరరావు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా వికలాంగులందరినీ ఐక్యంచేసి, వారి హక్కుల కోసం పోరాడుతానని చెప్పారు.

పాన్‌గల్ ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి నుంచి వివరాలు తెలుసుకుంటున్న హర్షవర్ధన్‌రెడ్డి

బీఆర్ఎస్ ఎంపీపీపై కాంగ్రెస్ హత్యాయత్నం

- ఒంటిపై నూనె చల్లి నిప్పంటించే కుట్ర
- అడ్డుకున్న ఎంపీపీ అనుచరులు
- ప్రాణభయంతో పీఎస్‌లోకి పరుగులు
- భౌతిక దాడులను సహించేది లేదు
- మాజీ ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి ఫైర్

పాన్‌గల్, జనవరి 25: బీఆర్ఎస్ ఎంపీపీపై కాంగ్రెస్ కార్యకర్తలు హత్యాయత్నానికి పాల్పడ్డారు. బుధవారం రాత్రి 11 గంటల తర్వాత వనపర్తి జిల్లా పాన్‌గల్ ఎంపీపీ శ్రీధర్‌రెడ్డిపై అధికార పార్టీకి చెందిన కార్యకర్తలు శ్రీను, ఆది స్వామి ఎడ్లబండ్లకు వాడే కందెన ఆయిల్ చల్లి నిప్పంటించేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో అక్కడే ఉన్న ఎంపీపీ అనుచరులు అడ్డుకోవడంతో పెను ప్రమాదం తప్పింది. అనంతరం ఎంపీపీ ప్రాణభయంతో సమీపంలోని పోలీస్ స్టేషన్‌లోకి పరుగులు తీశారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మున్సిపల్ చైర్మన్ గట్టుయాదవ్, వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం పోలీస్‌స్టేషన్ ఎదుట బైఠాయించారు. బాధ్యులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలిస్తామని పోలీసుల హామీతో శాంతించారు. దళితబంధు రాకపోవడానికి ముఖ్యకారణం తానేనంటూ గతంలోనూ తనపై రెండు సార్లు వాళ్లు దాడికి యత్నించారని శ్రీధర్‌రెడ్డి ఆరోపించారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి ఎంపీపీ శ్రీధర్‌రెడ్డిని పరామర్శించారు. దాడికి సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. గులాబీ శ్రేణులపై కాంగ్రెస్ నాయకులు భౌతిక దాడులకు దిగితే సహించేది లేదని హెచ్చరించారు. గతనెల పెద్దకొత్తపల్లి మండలం గంట్రావుపల్లిలో మాజీ సైనికుడు మల్లేశ్ హత్య మరువకముందే మళ్లీ ఎంపీపీపై కాంగ్రెస్ నేతలు దాడికి పాల్పడటం హేయమైన చర్య అన్నారు. ఈ దాడి వెనుక మంత్రి జూపల్లి కృష్ణారావు హస్తముందని ఆరోపించారు. పోలీసులు పక్షపాత ధోరణితో వ్యవహరించడం సరికాదన్నారు.

దీక్షను ఉద్దేశించి మాట్లాడుతున్న బీఆర్ఎస్ ములుగు జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారావు

దళితబంధు నిధులు విడుదల చేయాలి

ములుగులో లబ్ధిదారుల నిరసన దీక్ష • బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడి మద్దతు

ములుగురూరల్, జనవరి 25: రెండో విడత దళితబంధు నిధులు విడుదల చేయాలని ములుగు జిల్లా కేంద్రంలోని గాంధీ చౌక్ వద్ద లబ్ధిదారులు, దళితులు గురువారం ఒక రోజు నిరసన దీక్ష చేపట్టారు. దళితబంధు సాధన సమితి అధ్యక్షుడు కోగిల మహేశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనర్సింహారావు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా లక్ష్మీనర్సింహారావు మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రభుత్వం దళితుల సంక్షేమం కోసం రెండో విడత లబ్ధిదారులను ఎంపిక చేయగా ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆ పథకాన్ని అడ్డుకోవడం సరికాదని పేర్కొన్నారు. దళితులకు అన్యాయం చేయాలని చూస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఈ దీక్షకు భూపాలపల్లి, పినపాక, ఖమ్మం, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం ప్రాంతాలకు చెందిన దళితబంధు సాధన సమితి నాయకులు పాల్గొన్నారు.